# మార్పు

గడియారం రంగు రంగున పదిగంటలు కొట్టింది. బండి లేటు కాకుంటే వాళ్ళు ఈ క్షణంలోనో, మరో క్షణంలోనో వస్తారు. శాంతమ్మ హృదయం సంతోషంతో నిండిపోయింది.

మనిషి తనంతట తను ఎప్పుడూ మారడు. అతడ్ని మార్చేవి పరిస్థితులే. మనిషి పరిస్థితులకు తల ఒగ్గవలసిందే. ఈరోజు వస్తుందని ఆమె ఊహించలేదు. పరిస్థితులకు వివశమై ఒక పొరపాటు నిర్ణయం తీసుకుని ఉంటే ఈరోజు వచ్చేదా?

శారద తెలివిగల పిల్ల. పరిస్థితులను అర్థం చేసుకుంది. ఆమె తనలో తనే మురిసిపోయింది.

"శాంతా! చూశావా ఎవరొచ్చారో?" వీధి గుమ్మంలోంచి భర్త గట్టిగా అనకమునుపే రిక్షా ఆగిన శబ్దం విని శాంతమ్మ కూడా వచ్చింది.

ఎవరొచ్చారో తనకు తెలియదా? తన ఇంటిలో ఈనాడు కేరుకేరున ఏడుస్తూ అందర్నీ ఆనందం లోకాల్లో విహరించేటట్లు చేసే తన మనవణ్ణి తీసుకుని శారద వస్తున్నదనేగా తన ఈ సంతోషం. గుమ్మంలో వాళ్ళింకా కాలు పెట్టకుండా శారద ఒళ్ళోని తన మనవడి కోసం చేతులు చాచిన భర్తను చూసి ఇలాంటి రోజు రావాలని కదూ తను భగవంతుడ్ని ప్రార్థించింది.

మామగారికి పిల్లడ్ని అందిస్తున్న శారదను చూస్తుంటే శాంతమ్మగారికి ఎనలేని దుఃఖం వచ్చింది. ఆ దుఃఖం భరింపలేని ఆనందానికి ప్రతీక. ఆనాడే కనుక....?

★ ★ ★

శారద ఉత్తరం రాయడం పూర్తి చేసింది. తను రాసింది మరోమారు చదువుకుంది. ఆమెకు దుఃఖం ఆగలేదు.

ఈ ఉత్తరమే కనుక నాన్నగారు చదివితే ఎంత బాధపడతారు, అమ్మ దిగులుతో మంచంపట్టి పోదూ? వాళ్లు దిగులు పడతారనే కదూ తను ఇన్నాళ్ళూ ఉపేక్షిస్తూ వచ్చింది. నెల, రెండు నెలలు, ఆరు నెలలు చివరకు ఒక సంవత్సరం చూసింది.

పరిస్థితులు మెరుగుపడవా, తన భర్త ప్రవర్తనలో మార్పు రాదా అని ఆశించింది. రోజు రోజుకీ పరిస్థితి మరింత దిగజారిపోతున్నది.

మనసులేని భర్తతో కాపురం చేసి జీవితాంతం ఇలాగే బాధపడాలా? ఎవరికని చెప్పుకోను అనుకుంది అనేకమార్లు. అత్తగారు మంచివారే. తనను కూతురిలా చూసుకుంటుంది. మామగారు సహృదయులే. అత్తగారి ఔదార్యాన్ని, ఔన్నత్యాన్ని ఆశించి వచ్చిందా? తను కన్న కలలేమయ్యాయి?

దీనికి పరిష్కారం కావాలి. అది తన చేతిలో లేదు. తన తండ్రి తనంటే ప్రాణం పెడతాడు. అమ్మ తనను కడుపులో దాచుకుంటుంది. అన్నదమ్ములు తన దుఃఖాన్ని తమదిగా భావిస్తారు. ఇందరు ఆప్తులు ఉంటే తనెందుకు బాధపడాలి?

వాళ్ళకు పరిస్థితులు తెలియజేయాలి. వాళ్ళే ఏదో దారి చూపిస్తారు. శారద ఈ నిర్ణయానికి రావడానికి సరిగ్గా ఒక సంవత్సరం పట్టింది.

ఈరోజు తన జీవితంలో ఒక మలుపు తిరిగిన రోజు. ఔను, గత సంవత్సరం ఈరోజునే తన పెళ్ళి జరిగింది.

పెళ్ళి రోజును ప్రతి భార్యా, భర్తా ఎంత వేడుకగా జరుపుకుంటారు!

శారద ఉదయాన్నే తలంటుకొని స్నానం చేసింది. ముఖానికి పచ్చగా పసుపు రాసుకుంది. వాలుజడ వేసుకుని పెరట్లో పూసిన గులాబి పువ్వు ముచ్చటగా ముడుచుకుంది. కళ్ళకు కాటుక పెట్టుకుంది. నీలంరంగు బోర్డరున్న కంజివరం చీర కట్టుకుంది.

అపర లక్ష్మీదేవిలా తయారైన కోడల్ని చూసి శాంతమ్మగారు మురిసిపోయారు. కాని అంతలోనే ఆమె ముఖం పాలిపోయింది. ఏమిటో సృష్టి వైచిత్రం! ఇన్ని అందాలున్నాయి. తెలివితేటలున్నాయి – భర్తను ఆకర్షించలేకపోతున్నది. ఒక్క నలుసు కలిగి ఉంటే అబ్బాయి మారేవాడు కాడా?

భర్త లేవగానే వేడి వేడి కాఫీ ఇచ్చి కాళ్ళకు మొక్కింది శారద. అతను తిరస్కారంగా చూశాడు. ఐనా ఆమె ఆశవదులుకోలేదు. అతని కంటికి తను ఎందుకు ఆనడం లేదు? తను అందంగా లేదా?

భార్యాభర్తల మధ్య మాటలు లేవు. ఆమె చిత్తరువులా నిల్చుంది. నీతో నాకేం ప్రమేయం లేదన్నట్లు శంకరం పేపరులో తల దూర్చాడు. 'ఏంటి విశేషం ఈరోజు ఇంతగా ముస్తాబయ్యావు' అని అడగనైనా లేదు. దుఃఖాన్ని దిగమింగుకోవడం కాక ఆమె చెయ్యగలిగింది ఏముంది?

"ఏమండీ! ఈరోజు విశేషం ఏమిటో తెలుసా?" అంది. ప్రతి మనిషిలోనూ ఆశ ఉంటుంది. జడభరతుడిలో కూడా చలనం ఉంటుంది అని ఆమె ఆశపడి, మోసపోయింది.

శంకరం జవాబు చెప్పలేదు. 'ఏమిటి విశేషం' అని అడగలేదు. అతనికి తెలియదా? తెలిసినా పట్టించుకోడా? తను చెప్తే మాత్రం విని సంతోషిస్తాడా? ఈ ప్రశ్నలకు జవాబులు ఆమెకు తెలుసు. ఏడాదిగా అతనితో కాపురం చేస్తున్నది.

కాపురం – ఈ మాటకు అర్థం ఉందా?

"ఈరోజు మన పెళ్ళిరోజండీ! సాయంత్రం త్వరగా వస్తారు కదూ? సినిమాకు తీసుకువెళ్తారు కదూ?" ఆప్యాయంగా అడిగింది.

"ఊఁ!" ఆ జవాబుకే ఆమె సంతోషించింది.

సాయంత్రం నాలుగు గంటలకే ముస్తాబయింది. ఒక చీర కట్టుకుంది. బహుశా ఈ రంగు అతనికి నచ్చదు. ఆ చీర మార్చి మరొకటి కట్టుకుంది. మళ్లీ అనుమానం. అసలు ఆయన ఇలాంటి చీరను మెచ్చుకోరు. మరొకటి, మరొకటి మారుస్తూనే ఉంది.

శాంతమ్మగారు కోడల్ని చూశారు. కొడుకు మీద ఆమెకు ఎనలేని కోపం వచ్చింది. జీవితంలో అందరకూ ఆశించినవి దొరకవు. దొరికిన దానితో తృప్తిపడాలని తెలియదా? సూర్యుడు తన డ్యూటీ

పూర్తి చేసి పడమటి కొండలలోనికి వెళ్ళిపోయాడు. ఇక మాదే రాజ్యం అన్నట్లు చీకట్లు నలుమూలలా అలుముకున్నాయి.

"అయ్యో తల్లీ! ఇంకా దీపమైనా వేసుకోలేదా?" శాంతమ్మ లైటు వెలిగించి అంది. ఈ బయటి వెలుతురుతో తన మనసులోని చీకట్లు తొలగిపోతాయా?

"సాయంత్రం త్వరగానే వస్తానని చెప్పాడుగా! మరేం పని తగిలిందో" అంది.

అయితే శాంతమ్మకు తన సమర్థింపు ఎబ్బెట్టుగా ఉంది.

శారద పూర్వంలా అయితే కన్నీళ్ళు కార్చేది. అయితే అప్పటికే ఆమె కన్నీళ్ళు ఇంకిపోయాయి. హృదయం బెరడు కట్టుకుపోయింది. అలాగే మంచంమీద వాలిపోయింది. ఆమెను ఓదార్చే ధైర్యం శాంతమ్మకు లేకపోయింది.

ఆరోజు శంకరం గురించి తండ్రి చెపుతుంటే ఎంత సంతోషించింది.

"అబ్బాయి బి.ఎ. పాసయ్యాడు. సెంట్రలు గవర్నమెంటు ఉద్యోగం. చూడ్డానికి బాగుంటాడు. వాళ్ళకు కట్నకానుకల మీద కోరికలు లేవు. అమ్మాయి ఫోటో చూశారు. నచ్చిందన్నారు. పెళ్ళిచూపులు అక్కరలేదన్నారు. ఫోటో ఇచ్చారు. మరి అబ్బాయిని చూడకుండా అమ్మాయి అంగీకరిస్తుందా?"

అమ్మ ఫోటో చూసింది. "అబ్బాయి చూడ్డానికి బాగానే ఉన్నాడు. మీరు చూశారుగా? మీకు నచ్చాడా?" అడిగింది.

"అతనిలో వేలెత్తి చూపడానికి ఎలాంటి అవకతవకలు లేవు."

అమ్మ తనకు ఫోటో చూపిస్తూ - "నీ ఉద్దేశం ఏమిటి?" అంది.

ఇంతకు ముందర ఎందరో పెళ్ళికొడుకుల్ని చూసింది. అసలు అమ్మాయికి నచ్చిందో లేదో దీనిమీద ఆధారపడుతున్నారా? తన తండ్రి చూశాడు. అతనికి నచ్చింది. అతను తన క్షేమాన్ని కోరుకుంటాడుగాని, తనను కానిచోట ఇవ్వడుగా. అందుకే ఎలాంటి అనుమానాలూ పెట్టుకోకుండా తన అంగీకారం తెలిపింది.

పెళ్ళి చాలా ఘనంగా జరిగింది. ఎన్నో ఆశలతో తను అత్తగారింట కాలు పెట్టింది. ఊహించిన దానికి వ్యతిరేకంగా జరుగుతుంటే తను అర్థం చేసుకోలేకపోయింది. ఇష్టంలేని మనువుతనెందుకు చేసుకున్నాడు?

"శారదా! కొన్ని సంగతులు దాచాలనుకున్నా దాగవు. ఈ ఇంటి విషయాలు ఇరుగుపొరుగుల ద్వారా నీకు తెలియడం నాకిష్టం లేదు.నిన్ను కోడలుగా తెచ్చుకోవడంలో మేం పెద్ద పొరపాటు చేశామేమోనని నాకిప్పుడనిపిస్తున్నది" అంది శాంతమ్మ.

తనను, కోడలుగా చేసుకొని వాళ్ళిప్పుడు పరితపిస్తున్నారా? తనలో ఏం లోపాలున్నాయి?

"అమ్మాయ్! నువ్వు నా కూతురితో సమానురాలివి. ఈ పెళ్ళి చేసి నీ జీవితం దుఃఖభాజనం చేస్తున్నాం అనుకోలేదు. అబ్బాయి ఎవర్తెనో ప్రేమించాడు. ఆ పిల్లనే చేసుకోవాలనుకున్నాడు. మన కులం కాదు. ఆ పెళ్ళికి మేం అంగీకరించలేదు. మా మాట కాదని ఆ పిల్లను చేసుకుంటే నేను ఉరిపోసుకుని చస్తానని వాడితో అన్నాను. వాడికి నేనంటే తగని ఆపేక్ష. వాడు దానికి అంగీకరించాడు ఒక షరతు మీద."

'ఏమిటా షరతు?' అన్నట్లు చూసింది శారద.

"మరే పిల్లనూ చేసుకోను అన్నాడు. అయితే వాడి భీష్మ ప్రతిజ్ఞను మేం భరించలేకపోయాం. ముగ్గురాడపిల్లల తరువాత ఒక్కగానొక్క కొడుకు. వీడు పెళ్ళి చేసుకోకపోతే ఈ వంశం ఇంతటితో అంతరిస్తుంది. ఏదో మంచి పిల్లను చూసి పెళ్ళి చేయండి. వాడిని ఆ పిల్ల తన చాకచక్యంతో దారిలోకి తెస్తుంది. అంటూ శ్రేయోభిలాషులు సలహాలిచ్చారు. వారు చెప్పింది అమోదయోగ్యంగా తోచింది. అయినా వాడు పెళ్ళి చేసుకోనని మొండికేశాడు. నేను నిరాహార దీక్ష పూనాను. నేను ఎక్కడ గుటుక్కు మంటానోనని భయపడి చివరకు వాడు పెళ్ళికి అంగీకరించాడు.

"కానీ 'అమ్మా! నీ మాట మేరకు ఏ పిల్ల అయినా నన్ను చేసుకోవటానికి అంగీకరిస్తే చేసుకుంటాను. అయితే ఆమెకు దాంపత్య సుఖం ఇస్తానని మీరు తలపోస్తే అది మీ అపోహే అవుతుంది' అన్నాడు. వాడు అంగీకరించాడు అదే పదివేలు అనుకున్నాం. ఆ తరువాత వాడు దారిలోకి రాడా అనుకున్నాం. శారదా! ఈ విషయాలు నీకు వేరేమనుషులద్వారా తెలియడం మంచిది కాదు. అది మన సంసారంలో చిక్కులు తెస్తుంది. ఇక వాడిని దారిలోకి తెచ్చే బాధ్యత నీదే" అంది శాంతమ్మ.

శారదకు మతిపోయింది. తమ కొడుకు స్పష్టంగా చెప్పినా, వీళ్ళు ఇలా ఎందుకు సాహసించారు? వాళ్ళు ఉరి తీసుకొని చావలేకపోయారు కాని తన మెడలో ఉరితాడు బిగించారు. తన భర్తలో మార్పు వస్తుందని భావించడం మూర్ఖత్వం.

ఆమెలో ఇప్పుడు దిగులు లేదు. ఉదయకిరణాలు గదిలో వెలుగులు వెదజిమ్మాయి.

★ ★ ★

సూర్యనారాయణగారు ఉత్తరం చదివి దిగులు చెందారు. తన కూతురి బ్రతుకు అడవికాచిన వెన్నెలైందా?

'నాన్నా! సుఖసంతోషాలు లేని బ్రతుకు. మనసులేని భర్తతో కాపురం, ఒక పంజరంలో చిలుకలా ఉన్నాను. నాకు విముక్తిలేదా?

అమ్మా! ముందూ వెనుక ఆలోచించకుండా నీ బ్రతుకు బండలు చేశాను. పొరపాటు నాదమ్మా! అతను బావురుమన్నాడు. భార్యతోనూ, పెద్ద కొడుకుతోనూ సంప్రదించాడు.

"నాన్నా! అత్తమామలు ఎంత అభిమానం చూపించినా లాభం ఏమిటి – స్త్రీకి అత్యవసరమైన భర్త ఆదరణ లేనప్పుడు? ఇంకా ఆలోచన దేనికి, ఆమెను ఆ బందికానా నుంచి విముక్తురాలిని చేయాలి. మనం లేమూ? అక్కడ దొరికే తిండి ఆమెకు ఇక్కడ దొరకదా? శారద చదువుకుంది. ఏదో ఉద్యోగం దొరకక పోదు. తన కాళ్ళమీద నిలబడుతుంది." అన్నాడు సూర్యనారాయణ పెద్దకొడుకు.

అంతకంటే మరోమార్గం లేదు. చూస్తూ చూస్తూ కుమార్తె అక్కడ బాధపడుతుంటే ఎలా ఉపేక్షించగలడు?

★ ★ ★

"మీ అమ్మాయికి ఇక్కడ ఎలాంటి కష్టమూ లేదు. నేను ఆమెను అవమానించడం లేదు, హింసించడం లేదు. ఆమెకు ఈ ఇంట్లో సర్వాధికారాలూ ఉన్నాయి. ఆమెకు ఇక్కడ ఉండటం ఇష్టం లేకపోతే, మీరు తీసుకువెళ్తానంటే నేను అభ్యంతరం చెప్పను" అన్నాడు శంకరం మామగారితో.

"క్షమించండి. మేం చేసింది పొరపాటు. పరిస్థితులు ఇలా పరిణమిస్తాయని ఊహించలేదు. మార్పు సహజం కదా. వాడిలో మార్పు రాకపోదా అని భావించాం. మేం ఆశించిన మార్పు రాలేదు. ఆమెను మా ఇంట్లో ఉంచమని అర్థించే అధికారం మాకు లేదు. పైగా అమ్మాయికి ఇక్కడ ఉండటం ఇష్టంలేదు. ఆమె ఎక్కడున్నా సుఖంగా ఉండటమే మా కానందం" అన్నాడు రామలింగం వియ్యంకుడితో.

శాంతమ్మకు బొత్తిగా ఇష్టం లేదు. దీనివల్ల ఎవరికి మాత్రం లాభం? దుఃఖమైనా, సుఖమైనా ఆడపిల్లకు అత్తవారిల్లే శరణ్యం. ఇప్పుడు తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళి మాత్రం ఆమె ఏం సుఖపడగలదు? ఆమె వియ్యంకుడికి బోధపరిచింది, వేడుకుంది. అయినా సూర్యనారాయణ కూతుర్ని తీసుకుపోవడానికే నిశ్చయించుకున్నాడు.

"శారదా! నీ స్థానాన్ని నీవు చెడగొట్టుకోవడం తెలివితక్కువతనం అవుతుంది. ఇంటిమీద, భార్యమీద మనసులేని, మమత లేని మనుషులు అన్ని దేశాలలోనూ, అన్ని కాలాలలోనూ ఉంటారు. కాని సాంఘికంగా ఇంటికీ, ఇల్లాలికీ గల స్థానాన్ని వారు చెప్పకపోయినా ఆంతర్యంలో కాదనరు.

"స్త్రీలోని సహజ మాతృత్వకాంక్షలా ప్రతి పురుషునిలోనూ సంసారాపేక్ష ఉంటుంది. పురుషుడు తనపట్ల మక్కువ చూపడమే కాక ఇంటిని కూడా ప్రేమించేటట్లు చూడడం ఒక విద్య. ప్రతి ఇల్లాలికీ ముఖ్యావసరమైన విద్య అది. శంకరం నీపట్ల మక్కువ చూపించడం లేదన్నా, ఈ ఇంటిని ప్రేమించలేకపోతున్నాడన్నా అందులో నీ ప్రయత్న లోపం ఉందని నేనంటాను. పతిని కాదనుకుని పుట్టింటికి వెళ్తే భంగపడేది నీవు. ఈనాడు నీ అవస్థలు చూసి వారు నీపట్ల సానుభూతిని ప్రదర్శిస్తున్నారు. అది ఎంతకాలం ఉంటుంది? తల్లిదండ్రులకు ఆడపిల్లలపైనా, మగబిడ్డలపైనా అభిమానం ఉంటుంది సమానంగానే. వృద్ధాప్యపు ప్రాంగణంలో అడుగు పెట్టిన నీ తల్లిదండ్రులు శాశ్వతంగా ఉండిపోతారా? నీ అన్నదమ్ములూ, వారి భార్యలూ ఇవే ప్రేమాదరణలను ఎల్లకాలం చూపిస్తారా? కాలంతోపాటు మార్పు రావడం సహజం. నీవు ఉద్యోగం చేసి నీ స్వశక్తి మీద నిలబడగలవు. అయితే అందులో కష్టాలు లేవా? నీ నిర్ణయం సరియైనదో కాదో అది కాలమే నిర్ణయిస్తుంది.

"అందరూ పరిస్థితులకు తలవంచవలసిందే. మనిషిని మార్చేవి పరిస్థితులే. ఆ మార్పు ఈ ఇంటిలోనూ, శంకరంలోనూ రావని ఎందుకు భావించాలి. నీ దీక్ష శంకరంలో మార్పు తేగలదని ఎందుకు అనుకోవు? పెళ్ళి అంటే నూరేళ్ళ పంట. ఒక సంవత్సరంతోనే నిరుత్సాహపడాలా?

"నేను పాతకాలపుదాన్ని. నీవు ఆధునిక తరానికి చెందినదానివి. ఆలోచించు - పరిస్థితులతో రాజీపడటం కాదు - వాటిని ధైర్యంగా ఎదుర్కోవడం మనిషి కర్తవ్యం. నాకు తోచింది నేను చెప్పాను. నీకు ఏది మంచిదని తోస్తే అదే చెయ్యి. ఎక్కడైనా నీవు సుఖంగా ఉండడమే నాకు కావాలి" శాంతమ్మ అంది.

శారద రెండు నిముషాల వరకు అనిశ్చిత స్థితిలో పడిపోయింది.

ఆ తరువాత ఆశ్చర్యం సూర్యనారాయణ వంతయింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1.8.1990)